క్లుప్తంగా

పట్టణాభివృద్ధికి కృషి



అచ్చంపేట రూరల్: పట్టణ అభివృద్ధి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయ సమీపంలో సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ రమేష్‌రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో అచ్చంపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. అవసరం ఉన్న ప్రతిచోట సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ యాదయ్య, ఆలయ కమిటీ సభ్యులు బాల్‌రాజు, నరేష్ పాల్గొన్నారు.

బీసీ కాలనీలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్ రూరల్: నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు బీసీ కాలనీలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని బుధవారం డీఈకి వినతిపత్రం అందజేశారు. కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కరెంట్ స్తంభాలు, తీగలు, ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీసీ కాలనీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి మధు, కోశాధికారి అంబేడ్కర్ సలహాదారులు పర్వతాలు, నాయకులు కృష్ణప్రసాద్, చందుహరికృష్ణ, శ్రీధర్, ఆటో రవి, ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

రెండు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు మంజూరు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకు రెండు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు మంజూరు చేస్తు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తిలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు మంజూరు చేయడంతో పాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న మంజూరైన సిబ్బందితో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందిని సర్దుబాటు చేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌ను ఈ కేటగిరి నుంచి సి కేటగిరికి అప్‌గ్రేడ్ చేస్తు ఉత్తర్వులు జారీ చేయడంతో మరిన్ని సదుపాయాలు సమకూరనున్నాయి.

దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకొని ప్రతీకారం

కొల్లాపూర్ రూరల్: దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకొని బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రతీకారానికి పాల్పడుతుందని దళిత దండు రాష్ట్ర అధ్యక్షుడు బచ్చలకూర బాల్‌రాజు ఆరోపించారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధినాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాం. దీపై ఈడీ సంస్థ చార్జిషీట్ దాఖలు చేయటాన్ని ఖండించారు. నేషనల్ హెరాల్డ్‌కు చెందిన ఆస్తులను ఏకపక్షంగా, అన్యాయంగా సీజ్ చేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం చర్యలను ఖండిస్తు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

బెస్ట్ యాంకర్‌కు సన్మానం

మన్ననూర్: అచ్చంపేట నియోజకవర్గంలో కొంత కాలంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలలో బెస్టు యాంకరింగ్ (వ్యాఖ్యాతగా) చేస్తూ పలువురి నుంచి ప్రశంసలు పొందుతున్న ఎండీ మజీద్‌ను అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్ బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, ఉపాధ్యాయుడు జనార్దన్ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం

కొల్లాపూర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తారని ఎంఈఓ ఇమ్మాన్యుయేల్ అన్నారు. బుధవారం మండలంలోని ఎన్మన్‌బెట్ల, జావాయిపల్లి గ్రామాల్లో పాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను, మిడ్ డే మిల్స్‌ను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకొని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

తిమ్మాజిపేట: మండలంలోని మరికల్ గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న పనులను బుధవారం ఎంపీడీఓ లక్ష్మీదేవి పరిశీలించారు. గ్రామానికి చెందిన పలువురి రైతుల భూములలో పాంపాండ్, భూమి అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అదేవిధంగా నర్సరీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్‌యువ వికాసం, ఉపాధి పనిలో కూలీల సంఖ్య, తాగునీరు తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలను అందజేస్తున్న నాయకులు

కల్వకుర్తి రూరల్: రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించి సమాజంలోని ప్రజలందరికీ మేలు చేయాలని సంకల్పంతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి మండలంలోని తాంద్ర గ్రామ పాఠశాల అభివృద్ధికి మంజూరు చేసిన రూ.5 కోట్లతో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, సాయిరెడ్డి, ఆశాదీప్ రెడ్డి, సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్, సుదర్శన్ రెడ్డి తదితరులు పలువురు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోండి



తాడూరు మండలం అల్లాపూర్‌లో పశువుకు టీకా వేస్తున్న వైద్యాధికారి

తాడూరు/ ఊర్కొండ/తిమ్మాజిపేట: పశువైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని తాడూరు, తిమ్మాజిపేట పశు వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం తాడూరు మండలంలోని అల్లాపూర్‌లో, తిమ్మాజిపేట మండలంలోని చేగుంట, కోడుపర్తి, ఆవంచ గ్రామాలల్లో ఉచిత గాలికుంటు శిబిరాలను నిర్వహించారు. ఎంఏడీసీబీ–ఎఫ్‌ఎం కార్యక్రమంలో భాగంగా ఈనెల 16 నుంచి మే14 వరకు శిబిరాలు కొనసాగుతాయన్నారు. అదేవిధంగా ఊర్కొండ మండలంలోని మాదారంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ రాజేష్ వేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం: అగ్నిప్రమాదాలపై అప్రమత్తత ఉండాలని అగ్నిమాపక అధికారి కృష్ణమూర్తి అన్నారు. బుధవారం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలో ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినపుడు మంటలు ఆర్పేందుకు ఫైర్ ఎక్స్‌టింగ్‌విషర్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రమాద సమయంతో ఆస్తినష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అపార్ట్‌మెంట్లలో, షాపింగ్‌మాల్స్, ఆస్పత్రులు, పాఠశాలల్లో అగ్ని మాపక యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవించిన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. నేషనల్ ఫైర్ సర్వీస్ వర్క్ ప్రోగ్రాంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు అగ్నిమాపక శాఖ అధికారి ఎం.కురుమూర్తి తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సంతోష్‌కుమార్, అటవీ అధికారులు రామదాసు, సుభాష్‌తోపాటు కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

మన్ననూర్: అమ్రాబాద్ మండల కేంద్రంలోని అమరేశ్వర కోలాట బృందం ఆధ్వర్యంలో కోలాటంపై శిక్షణ నిర్వహిస్తునట్లు బృందం ప్రతినిధి నీల శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10 నుంచి 15 ఏళ్ల లోపు వయస్సు కలిగిన బాల బాలికలు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారం పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు సెల్: 8185813463, 9441365457 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల హర్షం

మన్ననూర్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకావడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ అచ్చంపేట నియోజక వర్గం ఎస్సీసెల్ అధ్యక్షుడు చింతల రాజ్ గోపాల్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పోలుమూరి రాజ్, చెన్నయ్య, జగపతి, నిరంజన్ ఎమ్మెల్యే వంశీకృష్ణను కలిసి సన్మానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి



చారకొండ: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని జీహెచ్‌ఎం భగవాన్ రెడ్డి అన్నారు. మండలంలోని సిర్సనగండ్ల, రామచంద్రాపురంలో బుధవారం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే పథకాలపై అవగాహన కల్పించారు. ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు యాదగిరి, రాజేందర్, కమాలాకర్ రావు తదితరులు ఉన్నారు.

కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు

మన్ననూర్: స్థానిక అంబేడ్కర్ కాలనీలోని వీధిదీపాలు షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయాయి. దీంతో కాలనీవాసులు గ్రామ పంచాయతీ అధికారులకు సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు విన్నవించారు. ఈ మేరకు అధికారులు స్పందించి బుధవారం విద్యుత్ అధికారులు, సిబ్బంది సహాయంతో కాలనీలోని వీధులతో పాటు మన్ననూర్–మద్దిమడుగు ప్రధాన రహదారిలోని విద్యుత్ స్తంభాలకు బల్బులు బిగించారు. వీధి దీపాలు వేయించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి భీముడుకు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా పోషణ పక్షోత్సవాలు



లింగాల: పోషణ పక్షోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని 8వ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ బుధవారం గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పండ్లు, గుడ్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మౌనిక, తిర్పతమ్మ, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కందనూలు: పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉండొచ్చని నాగర్‌కర్నూల్ సెక్టార్ సూపర్‌వైజర్ శోభారాణి అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ మండలంలోని గుడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే రక్తహీనత దరిచేరదన్నారు. పిల్లల బరువు, ఎత్తు చూసి తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కవిత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డు దారులకు బియ్యం ఇవ్వాలి

పెద్దకొత్తపల్లి: కొత్త రేషన్‌కార్డులు పొందిన లబ్ధిదారులకు రేషన్ బియ్యాన్ని అందించాలని తహసీల్దార్ జేకే మోహన్ అన్నారు. బుధవారం కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా రేషన్ కార్డులు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్ నాయక్, ఆర్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

ఉప్పునుంతల: మండలంలోని శ్రీశైలం- హైదరాబాద్ రహదారిలో లత్తీపూర్ స్టేజీ సమీపంలో బుధవారం మధ్యాహ్నం శ్రీశైలం వైపు వెళ్తున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఒక పక్కకు ఒరగిపోవడంతో ప్రయాణికులు భయంతో కిందకు దిగారు. హైదరాబాద్ పికెట్ డిపోకు చెందిన లగ్జరీ బస్సు 20 మంది ప్రయాణికులతో శ్రీశైలం వెళ్తోంది. డ్రైవర్ బస్సును నడిపిస్తూ ప్రయాణికులకు టికెట్లు ఇస్తుండగా బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డుకిందకు దూసుకెళ్లింది. సమీపంలో గోతులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అంతా ఊపిరిపీల్చుకున్నారు.



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తాడూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో యటిదారిపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులనే ఆదుకునేందుకు సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. రైతులు ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని దళారులను నమ్మి మోసం పోవద్దన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం ఇసుక వాడకంపై ఆగ్రహం



బల్మూర్: మండల కేంద్రంలో రూ.2.90లక్షల వ్యయంతో నిర్మిస్తున్న స్వచ్ఛభారత్ మరుగుదొడ్ల నిర్మాణ పనులకు నాసిరకం ఇసుకను వినియోగించడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారుల ఆదేశాలు కాంట్రాక్టర్ బేఖాతరు చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాటర్ ఫిల్టర్ బహూకరణ



ఊర్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు బుధవారం ఆక్వాగార్డ్ వాటర్ ఫిల్టర్‌ను గ్రామస్తుడు కృపయ్య జ్ఞాపకార్థం ఆయన కుమార్తె దార వసంత బహూకరించారు. విర్బాక్ అనిమల్ హెల్త్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ వారి ఆర్థిక సహకారంతో అందించినట్లు ఆమె పేర్కొన్నారు. సిరాజుద్దీన్, మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్, బిజినెస్ ఆఫీసర్స్ ఈఏ సంతోష్ కరుణాకర్, హెచ్‌ఎం ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో బుధవారం అద్దె బస్సు డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. తమకు సరైన వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ సమ్మెకు దిగారు. ప్రైవేటు ఆర్టీసీ బస్సులను రాకపోకలు కొనసాగకుండా నిలిపారు. పనికి తగిన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి ఒక యూనిఫాం, ఫ్రీ బస్ పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బస్సు యజమానులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. బస్టాండు, డిపో పరిసరాల్లో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కోడేరు: చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శివమ్మ(38) ఈ నెల 14న భార్యభర్తలు గొడవ పడ్డారు. దీంతో ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త నర్సింహ, కూతుళ్లు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోకారి తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

తిమ్మాజిపేట: మండలంలోని మారేపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మన్నెమయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బుధవారం బాధితుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కిల్లె మల్లయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం



ఆస్పత్రి సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ సంతోష్

తాడూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతోందని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగాగా ఆయన సిబ్బంది, ఓపీ రిజిస్టర్లు మందులు నిల్వ చేయి స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. ఆయా వార్డుల్లో రోగులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ ప్రసవాలు జరిగేటట్లు చూడాలని వైద్యులకు సూచించారు. వడదెబ్బకు గురైన వ్యక్తులకు వెంటనే ప్రథమ చికిత్స అందించేటట్లు విస్తృత అవగాహన కల్పించాలని వైద్యులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ దేవసహాయం, జిల్లా వైద్య అధికారి స్వరాజ్యలక్ష్మి, వైద్యాధికారులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న డీఈఓ

కందనూలు: విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటునట్లు డీఈఓ రమేష్ కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ మండలంలోని విద్యాశాఖ కార్యాలయంలో కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉచితంగా బుక్స్, యూనిఫామ్స్, క్వాలిటీ ఎడ్యుకేషన్, డిజిటల్ క్లాస్ రూమ్, ప్యూరీఫైడ్ డ్రింకింగ్ వాటర్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వంటి సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, సంస్కారం విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తామని తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా వారిని ప్రోత్సహించాలని కోరారు. గుడిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి కురుమయ్యను డీఈఓ అభినందించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి, ఏసీ రాజశేఖర్ రావు, స్కూల్ గేమ్ కార్యదర్శి పాండు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను మార్చొద్దు



నాగర్‌కర్నూల్ రూరల్: కార్మిక సంక్షేమ చట్టంలో నిబంధనలను మార్చొద్దని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారెడు శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 21 ,22 తేదీల్లో తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంఘం 4వ మహాసభలు శంషాబాద్ పట్టణంలోని ఎంఎంఆర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్న పాగ శ్రీనివాసులు, వెంకటస్వామి, రామస్వామి, కురుమయ్య, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

బీసీ చైతన్య సభను విజయవంతం చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ఈ నెల 18న జిల్లా కేంద్రంలో జరిగే బీసీ చైతన్య సభను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ జిల్లా కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బీసీల చైతన్య సభకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రిటైర్డు ప్రొఫెసర్లు మురళీమనోహర్ సింహాద్రి, రిటైర్డ్ డీఓ విజయ్ కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. బీసీవాదులు అధికంగా పాల్గొనాలని కోరారు.

భూ భారతి చట్టంతో రైతుకు భరోసా

వంగూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టంతో రైతుకు భరోసా కలిగిందని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పోల్కంపల్లిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. కొండారెడ్డిపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కేపీఎస్ రెడ్డి, రాములునాయక్, గోపాల్‌రెడ్డి, భవాని, భూభారతి చట్టం సభ్యులు సునీల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, కల్వకుర్తి ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ మురళీమోహన్, మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల సర్వే

పెద్దకొత్తపల్లి: కొత్తపేట శివారులో ఉన్న సర్వే నంబర్‌లో 166, 167 ఉన్న భూములను తహసీల్దార్ జేకే మోహన్, ఫారెస్టు అధికారి ఈశ్వర్‌లు బుధవారం భూములను పరిశీలించారు. ఈ సర్వే నంబర్లలో 40 ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్నామని ఇటీవల కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులకు రైతులు విన్నవించారు. ఈమేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేసి కలెక్టర్‌కు రిపోర్టు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ బాబునాయక్, ఆర్‌ఐ సురేష్, అటవిశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్‌లో చేయి పడి తీవ్ర గాయాలు

తిమ్మాజిపేట: పశుగ్రాసం కత్తిరిస్తూ రైతు చేయికి తీవ్రగాయాలు కావడంతో మణికట్టుకు వారకు తొలగించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని గుమ్మకొండ గ్రామానికి చెందిన రైతు బంగారయ్య తన వ్యవసాయ పొలం వద్ద మంగళవారం సాయంత్రం పశుగ్రాసం(చొప్ప) కత్తిరిస్తున్నాడు. ప్రమాదవశాత్తు చేయి మిషన్‌లో పడింది. గమనించిన పక్క రైతులు వెంటనే చికిత్స కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. కుడి చేయి మణికట్టు వరకు నుజ్జునుజ్జు కావడంతో అక్కడి వరకు చేయిని తొలగించారు.

‘ఉపాధి’ కూలీల సంఖ్య పెంచాలి

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో చేపడుతున్న ఉపాధి పనులలో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారిగా పనులు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు నిర్వహించే ప్రదేశాల వద్ద కూలీలకు కనీస సౌకార్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీఓ చంద్రసిద్ధార్థ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఎల్లమ్మ ఉత్సవాలు



తెలకపల్లి: మండల కేంద్రంలో ఐదురోజులపాటి కొనసాగిన ఎల్లమ్మ పండుగలు బుధవారంతో ముగిసాయి. చివరిరోజు బండారు కార్యక్రమంలో వైభవంగా నిర్వహించారు. బండారు చల్లుకొని సందడి చేశారు. బైండ్ల కులస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం అందజేత



లింగాల: మండల అటవీ శాఖ రేంజ్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పెద్దపులి, చిరుత పులుల దాడిలో మృతి చెందిన పశువులు, ఇతర మూగజీవాలకు సంబంధించిన బాధిత యజమానులకు బుధవారం మండల కేంద్రంలోని రేంజ్ కార్యాలయంలో ఎఫ్‌ఆర్వో ఈశ్వర్ అటవీ శాఖ నుంచి మంజూరైన నష్ట పరిహారాన్ని అందజేశారు. క్యాంపు రాయవరానికి చెందిన సూర శేఖర్‌కు రూ.10 వేలు, పాత దారారానికి చెందిన ఎస్. మహేష్‌కు రూ.10 వేలు. మారెడుదిన్నెకు చెందిన ఎస్.బాలయ్యకు రూ.13 వేల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జయదేవ్, ఎఫ్‌ఎస్‌ఓ రాంబాబు, ఎఫ్‌బీఓ ఖాదర్‌పాషా పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



ఉప్పునుంతల: వేతనాలు చెల్లించాలని మండలంలోని ఎన్‌ఆర్ ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఎంపీడీఓ మోహన్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. పే స్కేల్ వర్తింపజేయడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అదేవిధంగా నెలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, సర్క్యులర్ నంబర్ 4779ను ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మల్లయ్య, బాలేపీర్, దేవేందర్, రాము, రమేష్, పద్మమ్మ, మశయ్య తదితరులు ఉన్నారు.